క్లుప్తంగా

పనితీరులో మార్పు రావాలి

నాతవరం: పంచాయతీరాజ్ శాఖలో పని చేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, పని తీరులో మార్పు రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎంపీడీవో కె.ఉషశ్రీ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ శాఖలో పని చేసే అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు అభివృద్ధి పనుల విషయంపై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు రాకుండా పని చేయాలని, లేకుంటే తాము తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

టాలెంట్ టెస్ట్‌లో అయ్యన్న విద్యార్థుల ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కె.కోటపాడు: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ 2024–25 సెకండ్ రౌండ్ ప్రతిభా పరీక్షల్లో కె.కోటపాడు అయ్యన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గణితంలో పాఠశాలకు చెందిన 1వ తరగతి విద్యార్థి ఇమంది యజ్ఞ 15వ ర్యాంక్, 2వ తరగతి విద్యార్థి సూరిశెట్టి లేఖనలక్ష్మి 12వ ర్యాంక్, 4వ తరగతి విద్యార్థి వేమల మేఘన 5వ ర్యాంక్, 5వ తరగతి విద్యార్థిని బోశం పూజిత 16వ ర్యాంక్, సైన్స్‌లో 4వ తరగతి విద్యార్థి డొంక జ్ఞాన సాద్విక్ 16వ ర్యాంక్ సాధించాడు. వీరిని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఖాసిం అభినందించారు.

కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

మాకవరపాలెం: వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండలవ్యాప్తంగా 420 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరంతా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ఎం.అలమండ నూకాంబిక అమ్మవారి జాతర నేడు

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండ గ్రామంలో నూకాంబిక అమ్మవారి జాతర శుక్రవారం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ దాడి జగన్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు.

సెకీ ఒప్పందం రద్దు చేయాలి

నర్సీపట్నం: సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గురువారం ఏపీఈపీడీసీఎల్ (ఇండోర్) సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసుకున్న చీకటి సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఒప్పందం రద్దు చేయమని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. హిందూజాతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీలు విధించిందన్నారు. విద్యుత్ భారంపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని రాజు పిలుపునిచ్చారు.

రక్షణ కల్పించాలని ఆర్డీవోకు ఫిర్యాదు


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

నర్సీపట్నం: దశాబ్దాలుగా ఎం.కె.పట్నం రెవెన్యూ పరిధిలోని 10 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న చటర్జీపురం ఆదివాసీలకు రక్షణ కల్పించాలని కోరుతూ అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.జనార్దన్ ఆధ్వర్యంలో గిరిజనులు ఆర్డీవో కార్యాలయ ఏవో సూర్యనారాయణకు ఫిర్యాదు చేశారు. కొయ్యూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధి నుండి గిరిజనులకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా కోలాటం పోటీలు

బుచ్చెయ్యపేట: మండలంలో గల కేపీ అగ్రహారంలో జిల్లా స్థాయి కోలాటం పోటీలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధి చెందిన నూకాలతల్లి పండగను గ్రామస్తులు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అఖండ దీపారాధన, కుంకుమ పూజలు చేశారు. రాత్రి జరిగిన కోలాటం పోటీల్లో పలు గ్రామాల నుండి వచ్చిన 30 జట్లు పాల్గొన్నాయి.


పశువులకు మేతగా అందించేందుకు పెంచుతున్న సుగర్ గ్రేజ్ గడ్డి


పశువులకు మేతగా అందిస్తున్న పోషక విలువలున్న గడ్డి

వేసవిలోనూ పాల దిగుబడి తగ్గకుండా ప్రత్యేక చర్యలు

అధిక పోషక విలువలున్న గడ్డిని ఆహారంగా అందిస్తున్న రైతు అచ్చింనాయుడు


గడ్డిని చాప్ కట్టర్ ద్వారా చిన్నచిన్న ముక్కలు చేస్తున్న రైతు అచ్చింనాయుడు

కాలమేదైనా.. పాలవెల్లువ

కె.కోటపాడు: సాధారణ రోజులతో పోలిస్తే పాల దిగుబడి వేసవిలో తగ్గుతుంది. అధిక ఎండలతో ప్రధానంగా రైతులకు పశుగ్రాస సమస్య ఎదురవుతుంటుంది. దీంతో పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల సాధారణ రోజుల కంటే పశువులు పాలు ఇవ్వడం తగ్గించడంతో రైతుల ఆర్థిక పరిస్థితులపై ప్రభావం పడుతుంది. ఇటువంటి పరిస్థితులను గమనించిన మండలంలో చిరికివానిపాలెం గ్రామానికి చెందిన రైతు లాలం అచ్చింనాయుడు వేసవిలో పాల దిగుబడి తగ్గకుండా జాగ్రత్తలు పాటిస్తున్నాడు. సాధారణ రోజుల్లో వచ్చే పాల దిగుబడినే వేసవిలోనూ సాధిస్తున్నాడు. ఎండల కారణంగా పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు పశువులకు మేతగా అత్యధిక పోషక విలువలు కలిగిన సూపర్ నేపియర్ గడ్డి, సుగర్ గ్రేజ్ గడ్డి, ఎడ్జిలూషర్న్ గడ్డిని రైతు అచ్చింనాయుడు పెంచుతున్నాడు. ఈ మూడు రకాల గడ్డిని చాప్‌కట్టర్ ద్వారా చిన్న చిన్న ముక్కలుగా చేసి, మూడు రకాల గడ్డిని కలిపి పశువులకు మేతగా అందిస్తున్నాడు. వీటితో పాటు ప్రతి పశువుకు అరకిలో నువ్వులు, వేరుశెనగ చెక్కల మిశ్రమాన్ని అందించడంతో సాధారణ రోజుల్లో వచ్చే పాల దిగుబడే వేసవిలోను వస్తుందని అతను పేర్కొంటున్నాడు. తన పొలంలో పెంచుతున్న గడ్డి సుమారు 8 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. పశువులు తినేందుకు రుచికరంగా ఉంటుంది. ఈ గడ్డితో పాటు నువ్వులు, వేరుశెనగ చెక్కల మిశ్రమాన్ని పశువులకు అందించడం వల్ల మంచి పోషక విలువలు అంది పశువులు చక్కటి ఆరోగ్యంతో ఉండి అధిక పాల దిగుబడి ఇస్తున్నాయి.

నీటి వసతి ఉన్న చోట గడ్డి సాగు చేయాలి..



నేను 30 దేశీయ జాతి ఆవులను పెంచుతున్నాను. వేసవిలో పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాను. గత ఐదేళ్ల నుండి ఈ విధంగానే వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటూ, అధిక పోషక విలువలు గల గడ్డిని పశువులకు మేతగా అందిస్తున్నాను సూపర్ నేపియర్, సుగర్ గ్రేజ్, ఎడ్జిలూషర్న్ గడ్డి పెంచుతూ వీటిని చిన్న పరిమాణంలో ముక్కలుగా చేసి పశువులకు వేస్తున్నాను. ప్రతి రోజూ రెండు సమయాల్లో పశువులను నీటితో శుభ్రపరుస్తున్నాను. తద్వారా పశువులు వేసవి ఉష్ణోగ్రత బారిన పడకుండా ఉంటాయి. పోషక విలువలు గల గడ్డిని అందించడం వల్ల పాల దిగుబడి తగ్గలేదు.

– లాలం అచ్చింనాయుడు, రైతు, చిరికివానిపాలెం

సామూహిక నీటి కుండీల నిర్మాణానికి చర్యలు


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు

నాతవరం: జిల్లావ్యాప్తంగా వేసవిలో పశువులకు తాగునీటి సమస్య లేకుండా ఉపాధి హామీ పథకంలో సామూహిక నీటి కుండీలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. శృంగవరంలో పశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పాడి రైతులతో సమావేశమయ్యారు. పాడి ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు రాయితీపై పశుగ్రాసం విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంచేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నీటి కుండీలు నిర్మించేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో స్థలం చూపిస్తే ఉపాధి హామీ పథకం నిధులతో వెంటనే నిర్మిస్తామన్నారు. పాయకరావుపేట వెటర్నరీ విభాగం ఏడీ శ్రీనివాసరావు, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పశువైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

మాకవరపాలెం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఈవో శేషునాయుడు అన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై ప్రణాళికలు రూపొందించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత భాగం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో విత్తనాలు వేసుకోవాలన్నారు. ఇందులో 30 రకాల విత్తనాలు కలిపి తొలకరి వర్షాలకు ముందు వేసుకోవడంపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి విత్తన సేకరణకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రకృతి సేద్య సిబ్బంది కవిత, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కొవ్వూరు నూకాలతల్లి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు

రోలుగుంట: పలు గ్రామాల ప్రధాన కూడలిలో ఉన్న కొవ్వూరు నూకాలతల్లి పండగను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ అమ్మవారి గుడి కొవ్వూరు, కె.నాయుడుపాలెం, రోలుగుంట గ్రామాలను ఆనుకుని ఉండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రోలుగుంట తహసీల్దార్ నాగమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకుడు బంటు రాజు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా కాల్చి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు ప్రత్యేక ఏర్పాట్లు


మర్రిచెట్టు కింద కొలువైన అమ్మవారి ఆలయం

నాతవరం: బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జిల్లేడుపూడి సర్పంచ్ లాలం రమణ తెలిపారు. ఇక్కడ బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగను ప్రతి ఏటా కొత్త అమవాస్య రోజు చేయడం పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయం. ఈ ప్రాంతీయుల ఆరాధ్యదైవమైన అమ్మవారికి శుక్రవారం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.

అన్నదానానికి వంట పాత్రల వితరణ


అన్నదానానికి వంట పాత్రలు అందజేస్తున్న దాతలు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయం వద్ద గల షిర్డీ సాయిబాబా ఆలయంలో మహిళా భక్తులు స్వచ్ఛందంగా ప్రతి గురువారం అన్నదానం చేస్తున్నారు. దాతల సహకారంతో గత మూడు వారాల నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అన్నదానానికి అవసరమైన వంట పాత్రలను దేవరాపల్లికి చెందిన వాలేటి నాగరాజు, నమ్మి దేముళ్లు, కొత్తూరు దాసు దంపతులు స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి, నాయుడు దంపతులకు గురువారం అందజేశారు. సిద్ధప్ప, రమణ, అప్పలరాజు తదితర షిర్డీ సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వేని సద్వినియోగం చేసుకోవాలి

రావికమతం: భూముల రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ తెలిపారు. రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా 12 గ్రామాలను ఎంపిక చేశామని, అందులో 10 గ్రామాల్లో గ్రౌండ్ స్థాయిలో సర్వే పూర్తయిందన్నారు. డివిజన్‌లో 357 రెవెన్యూ గ్రామాలకు గాను గతంలో 208 గ్రామాలకు రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులర్ చేస్తామని, వారు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి. వెంకట రమణ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ


దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: మండలంలో మేడివాడ హైస్కూల్లో మండలానికి చెందిన 14 మంది దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, ఐఈఆర్పీ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ మండలంలో గతంలో 70 మంది దివ్యాంగ విద్యార్థులకు బస్ పాసులు అందజేశామన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఈ బస్ పాసుల ద్వారా 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని, ఈ సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా పురపాలక సంఘం సాధారణ సమావేశం


వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్లు పద్మావతి, మధు మధ్య వాగ్వాదం

నర్సీపట్నం: నర్సీపట్నం పురపాలక సంఘం సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 34 అంశాలను కౌన్సిల్ ముందుంచారు. మున్సిపాలిటీకి చెందిన జనరల్ ఫండ్ నిధులను టీడీపీ కాంట్రాక్టర్ల ప్రయోజనానికి ఖర్చు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ఆరోపించారు. జనరల్ ఫండ్ నుండి రూ.1.75 కోట్లు ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లుగా చెలామణీ అవుతున్న టీడీపీ నాయకులకు మున్సిపల్ అధికారులు కట్టబెడుతున్నారన్నారు. వైస్‌చైర్మన్ చేసిన ఆరోపణలకు టీడీపీ కౌన్సిలర్లు సీహెచ్ పద్మావతి, ధనిమిరెడ్డి మధు, శ్రీకాంత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం చోటు చేసుకుంది. అద్దె ట్రాక్టర్లకు మూడేళ్లుగా బిల్లులు ఎందుకు చెల్లించలేదని మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అధికారులను నిలదీశారు. ట్రాక్టర్ బిల్లులకు సంబంధించిన ఫైల్ తన వద్దకు రాలేదని కమిషనర్ బదులిచ్చారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు కూడా ఆదిలక్ష్మికి బాసటగా నిలిచారు. చైర్‌పర్సన్ కల్పించుకుని సమస్య పరిష్కారానికి చూడాలని అధికారులను ఆదేశించారు. మొదట్లో సమావేశం సజావుగా సాగినప్పటికీ రసాభాసగా మారింది.

చిన్నారులను తీర్చిదిద్దేందుకే శిక్షణ తరగతులు


శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈవో సత్యనారాయణ, వరహాలబాబు

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులను కాలానుగుణంగా తీర్చిదిద్దడానికే ప్రత్యేక శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశమని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండలంలో మర్రిపాలెంలో గురువారం గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో చెప్పిన విషయాలను విధిగా మీ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. ఈ విషయంలో కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ గ్రామ ఉప సర్పంచ్ పదవులు

వైఎస్సార్‌సీపీ కైవసం


ఉప సర్పంచ్‌గా జవ్వాది వరహాలుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి రమణి


గోవిందరాజులును అభినందిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలో నాలుగు గ్రామ ఉప సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి, మూడు ఉప సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. కింతలి ఉప సర్పంచ్ పదవి అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. మేజర్ గ్రామ పంచాయతీ అయిన మాడుగుల గ్రామ ఉప సర్పంచ్ పదవికి 16వ వార్డు సభ్యుడు జవ్వాది వరహాలును పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామకపు పత్రాన్ని ప్రిసైడింగ్ అధికారి రమణి అందజేశారు. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ యడ్ల కళావతితో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు. ఒక వార్డు సభ్యుడు వేమన గణేష్ ఎన్నికకు ఆలస్యంగా వచ్చారు. రెండవ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా సూరిశెట్టి గోవిందరాజులును పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కాగా, గోవిందరాజులుకు దేశం, వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు మద్దతు పలికారు. గోవిందరాజులును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, మద్దాల వెంకట సత్యనారాయణ, కాళ్ల రాము, సూరిశెట్టి అచ్చిమినాయుడు, శంకర్రావు తదితరులు అభినందించారు. పోతనపూడి ఉప సర్పంచ్‌గా మైచర్ల నారాయణరావును వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాయిదా పడిన కింతలి ఉప సర్పంచ్ ఎన్నిక

మాడుగుల రూరల్: మండలంలో కింతలి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక శుక్రవారం నాటికి వాయిదా పడింది. ఈ ఎన్నిక నిర్వహణకు ప్రిసైడింగ్ అధికారి విజయలక్ష్మి గురువారం ఉదయం సమాయత్తం అయ్యారు. అయితే ఇక్కడ ఉప సర్పంచ్‌గా పల్లా పెద్దమ్మలు గతంలో ఉప సర్పంచ్‌గా పని చేశారు. దేశం పార్టీ మద్దతుదారు అయిన పెద్దమ్మలు ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాలు ఉప సర్పంచ్‌గా కొనసాగడానికి, మిగిలిన కాలానికి అప్పాన నారాయణరావు ఉప సర్పంచ్‌గా కొనసాగడానికి ముందుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే గురువారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలో పెద్దమ్మలు తిరిగి ఉప సర్పంచ్‌గా పోటీ చేయడానికి సిద్ధం అయ్యారు. దీంతో పెద్దమ్మలు, నారాయణరావు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఎన్నిక శుక్రవారం నాటికి వాయిదా వేసినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్యం


మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

కె.కోటపాడు: ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్యం సాధ్యపడుతుందని చీడికాడ ఎంపీడీవో వి.హేమ సుందరరావు అన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై గురువారం చీడికాడ మండలంలో గల అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది, క్లాప్‌మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి తడిపొడి చెత్త సేకరించి సంపద కేంద్రాలకు చేర్చే విధానం వివరించారు. వ్యాపారులు తడిపొడి చెత్తను ఏ విధంగా గుర్తించాలో కరపత్రాల ద్వారా తెలిపారు. చీడికాడ పంచాయతీ విస్తరణాధికారి గోపి, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వార్డు మెంబర్ వంటాకు గోవిందరావు, రాపేటి ప్రసాద్, చీడికాడ కార్యదర్శి ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు


ఎలక్ట్రికల్ ఏఈ శంకరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: రాష్ట్రంలో విద్యుత్ ట్రూ అప్ చార్జీల పెంపును ఉపసంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లి విద్యుత్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సీపీఎం నేత డి. వెంకన్న మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి రూ. 9412 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేయాలని ఈఆర్సీ ఆదేశించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ. 7912 కోట్లు భారం మోపేందుకు రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పైడితల్లి, సన్యాశి, సోములు తదితర సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ అధికారికి ఘన సత్కారం


చంద్రశేఖరరావును సత్కరిస్తున్న గ్రామస్తులు, పాడి రైతులు, రమణ తదితరులు


నాతవరం: శృంగవరం పశు వైద్యాధికారిగా కొంత కాలం ఎం. చంద్రశేఖరరావు పని చేశారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో పాడి అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఆయన గురువారం శృంగవరం పశువుల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అప్పట్లో అయనతో పరిచయం ఉన్న రైతులు, ప్రజాప్రతినిధులు, గోపాల మిత్రలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం అనంతరం గోపాలమిత్రగా పని చేసిన కిల్లాడ వెంకట రమణ, మాజీ సర్పంచ్ ఉలబాల అప్పలనాయుడు, రైతులు చంద్రశేఖరరావును ఘనంగా సత్కరించారు. వారు చూపిన అభిమానానికి చంద్రశేఖరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు


బోరు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: మండలంలో టి.అర్జాపురం పంచాయతీ రాజాన రమణ పాకల వద్ద మండల పరిషత్ నిధుల నుంచి తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వైస్ ఎంపీపీ భవానీ ప్రసాద్, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజాన రామునాయుడు తెలిపారు. బోరు ఏర్పాటు చేయడం వల్ల మంచినీటి సమస్య తీరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దిపల్లి రమేష్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అప్పలనాయుడు, మరిశా రమణ, గ్రామ నాయకులు గూటాల చిన్న, సీతిని శివ తదితరులు పాల్గొన్నారు.

తగ్గని చింతపండు ధర


అమ్మకానికి సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ: మండలంలోని కోనాం సంతలో ఈ గురువారం కూడా చింత పండు ధర తగ్గలేదు. కోనాం సంతకు హుకుంపేట, అనంతగిరి, దేవరాపల్లి, పాడేరు మండలాలకు చెందిన గిరి గ్రామాల చింత పండు భారీగా వస్తుంది. ఈ చింత పండుకు మంచి గిరాకీ ఉండడంతో విశాఖ, అనకాపల్లి, చోడవరంల నుంచి వ్యాపారులు, వినియోగదారులు తెల్లవారు జామునే కోనాం చేరుకుని చింతపండు కొనుగోలు చేస్తుంటారు. ఈ వారం గత వారం కంటే ఎక్కువ ధర పలికింది. 30 కిలోల కావిడి చింత పండు రూ. 1800 నుంచి రూ. 2 వేల వరకు పలికింది.